# ఇప్పటికీ...

మనలో చాలామందికి ఇప్పటికీ తెలియని విషయాలెన్నో ఉంటాయి. కొందరికైతే ఎప్పటికీ తెలియని విషయాలెన్నో ఉంటాయి.

ఏ విషయాలూ తెలియని వాళ్లకు ఏ బాధా వుండదు. సుఖంగా కూడా ఉండొచ్చు. అయితే, అలాంటి వాళ్లవల్ల వాళ్లకు తప్ప ఇతరులకు ఏ లాభమూ ఉండదు. అందరూ అలాగే ఉండివుంటే ఈ ప్రపంచం ఇంతగా మారేది కాదు. ఇంతటి ప్రగతిని సాధించేది కాదు.




అందరూ అలాగే ఉండకపోవడం వల్ల కొందరు ఆ అందరి గురించే ఆలోచించడం వల్ల ఎందరికో ఎన్నో మేళ్లు జరిగాయి.

తెలియని విషయాన్ని తెలుసుకోవడానికి కొందరు ఎంతగానో ఆలోచిస్తారు. శ్రమిస్తారు. విజయం సాధించేదాకా నిద్రపోరు. స్వసుఖం కూడా త్యజిస్తారు.

"నాలో, నీలో ఉన్నదేమిటి" అనే ప్రశ్న ఎంతోకాలం కిందటే కొందరికి వచ్చింది. అప్పుడు ఇప్పటి సైన్స్ లేదు. ఉన్నది సెన్స్ మాత్రమే.

వీరబ్రహ్మం గారి తత్వాల్లో సైన్స్ అభివృద్ధి చెందక ముందు గ్రహించిన కొన్ని విషయాలు తెలుస్తాయి. మనిషిలో ఉన్నది చీమూ నెత్తురూ అని ఓ తత్వం తెలుపుతుంది. అయితే, అందులో ఎందుకీ మోహాలు, ఎందుకీ ప్రలోభాలు అనే ఓ విరక్తి భావం కూడా ఉంటుంది, 'ఏమి జన్మము ఏమి జీవనము, ఓ మాయ ఘటమా' అంటూ.

తల్లి గర్భంలో పెరిగే శిశువు నెలనెలా ఎలా పరిణామం చెందుతుందో ఓ తత్వం పాట చెబుతుంది. అదెలా సాధ్యం అంటే, తెలియనిది తెలుసుకోవాలనే జిజ్ఞాస మనిషిలో ఉండడం వల్లేనని స్పష్టమవుతుంది.

తెలియని విషయాలు తెలుసుకోడానికి తగిన సాధనాలు లేనప్పుడు మానవుడు ఊహిస్తాడు. ఆ ఊహలనూ వాస్తవాలనూ ముడిపెట్టే ప్రయత్నం చేస్తాడు. పైన ఆకాశం ఉంది. కింద నేల ఉంది. ఆకాశంలో ఏం ఉంది? నేల కింద ఏం వుంది? అనే ప్రశ్న మన పూర్వీకుల్లో కొందరికి వచ్చింది. అవేవీ కనిపించనివి కాబట్టి ఊహించారు. పైన స్వర్గలోకం ఉందనుకున్నారు. కింద పాతాళ లోకం ఉందనుకున్నారు. ఆ ఊహలతో వాల్మీకి, వ్యాసుడు వంటి కవులు ఎన్నో కల్పించారు. దేవతల్ని సృష్టించారు. మానవులు కొందరు దేవతల్ని కలిసినట్టు, వివాహం చేసుకున్నట్టు రాశారు. అప్పటికి అవన్నీ నిజమనే చాలమంది అనుకున్నారు.

కొద్దిమంది మరింత తీవ్రంగా ఆలోచించకుండా ఉండలేకపోయారు. తమ ఆలోచనల్లతో సత్యాన్వేషణకు అవసరమైన సాధనాలను కనుగొన్నారు. నీటినుంచి, లోహాల నుంచి మనం ఇప్పుడనుభవిస్తున్న ఎన్నిటినో కనుగొన్నారు.

కె.వి.యస్.వర్మ ఫీచర్స్

రైలింజన్ రూపొందించానని మనిషి తృప్తి పడలేదు. కరెంటు ఇచ్చానని మనిషి సంతృప్తి పడలేదు. రేడియోతో సరిపెట్టుకోలేదు. టీవీతో ఇక చాలనుకోలేదు.

ఆకాశంలో కన్పించే నక్షత్రాల్లో ఎక్కువగా మెరిసేవాటికి మన పూర్వీకులు కొందరి పేర్లు పెట్టారు. ఫలానా నక్షత్రాలు సప్త రుషులన్నీ, ఫలానా నక్షత్రం ధ్రువుడనీ ఆ తర్వాత నవ గ్రహాలున్నాయనీ గుర్తించగలిగారు. సైన్స్‌ను ఉపయోగించుకుని గ్రహాల్ని గుర్తించి, రాకెట్‌ను తయారుచేసి మనిషి చంద్రమండలం మీద కాలుమోపాడు. ఇకచాలు, మనకు తెలియనిది లేదని అనుకోలేదు.

శోధించి సాధించేవాళ్లెప్పుడూ అలా అనుకోరు. ఈ సృష్టిలో మనకు తెలియనిది ఎప్పుడూ ఏదో ఉంటూనే వుంటుంది. కాబట్టి కొందరు శోధిస్తూనే ఉంటారు.

చిన్నచిన్న తోకచుక్కలు ఎప్పుడైనా పడిపోతే ఓ తార రాలిపోయిందనుకునేవారు. ఎవరో ఓ రాజు పోయాడనో పోతాడనో నమ్మేవారు. తోకచుక్క పడిపోవడం అపశకునం అని విశ్వసించేవారు. 1910లో హలీస్ కామెట్ (తోకచుక్క) కనిపించగానే ప్రజలు భయాందోళనకు లోనైనప్పుడు "చిన్నకాలపు చిన్న బుద్ధులు" అని మహాకవి గురజాడ వేళాకోలం ఆడాడు.

ఇప్పుడు అంతరిక్షంలో జులై 16 అర్ధరాత్రి నుంచి 20 రాత్రి ఏడుగంటల వరకూ షూమేకర్–లెవి 9 తోకచుక్క శకలాలు గురుగ్రహాన్ని ఢీకొంటున్నాయి. అయితే, ఆ శకలాలు భూమికి అభిముఖంగా కాకుండా అవతల వైపు ఉండే గురుగ్రహ తలాన్ని ఢీకొంటాయి కాబట్టి మనం ఆ దృశ్యాన్ని ప్రత్యక్షంగా చూడలేం.

ఎలక్ట్రానిక్ రంగంలో మొదటినుంచీ విశ్వవిజేతలైన జపనీయులు తమ టెలివిజన్‌లలో చూడగలుగుతున్నారు. మిగతావాళ్లకు ఇప్పటికీ ఆ అవకాశం లేదు. తర్వాత స్టిల్ ఫొటోలను మాత్రం చూస్తాం.

అవును మరి, ఇప్పటికీ మనకు తెలియని విషయాలెన్నో వున్నాయి.

187.94

ఆంధ్రభూమి దినపత్రిక